RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 244 ఆదిలాబాద్ ఎడిటర్ - సయ్యద్ కరీం శుక్రవారం, 8 మార్చి 2024 పేజీలు : 4 వెల : 2/-



# పంతాల కన్నా... ప్రజాశ్రేయస్సే ముఖ్యం

## అభివృద్ధి కోసం మెట్టు దిగడంలో తప్పు లేదు

## రాజీవ్ రహదారి ఎలివేటెడ్ కారిడార్‌కు శంకుస్థాపన చేసిన సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: పదేళ్ల బీఆర్ఎస్ దిక్కుమాలిన విధానాలతో ప్రజలు నష్టపోయారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజల అవసరాన్ని మర్చిపోయి గత కేసీఆర్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో గిల్లికజ్జాలు పెట్టుకుని రాజీవ్ రహదారి ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టును పక్కన పెట్టిందని మండిపడ్డారు. గురువారం నాడు సికింద్రాబాద్ అల్వాల్ టిమ్స్ సమీపంలో రాజీవ్ రహదారి ఎలివేటెడ్ కారిడార్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. రాజీవ్ రహదారి ఎలివేటెడ్ కారిడార్ పూర్తయితే మేడ్చల్, కుత్బుల్లాపూర్, కరీంనగర్, ఆదిలాబాద్ ప్రయాణం సులభతరం అవుతుందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఘర్షణతో ఈ ప్రాజెక్టు ఆలస్యమైందని చెప్పారు. తాము అధికారంలోకి రాగానే కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి సమస్యను పరిష్కరించామని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీని, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిసి ఈ ప్రాజెక్టు అవసరాన్ని వివరించామని చెప్పారు. భూముల కేటాయింపు, చాంద్రాయణగుట్ట రక్షణ శాఖ భూముల లీజ్ రెన్యూవల్ చేయకుండా గత బీఆర్ఎస్ ప్రభుత్వం జాప్యం చేసిందని మండిపడ్డారు. అధికారంలోకి రాగానే తక్షణమే తాము అధికారులతో సమీక్షించి రక్షణ శాఖకు భూములు అప్పగించామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.

**ప్రజల అవసరాల కోసమే ఒక మెట్టు దిగా...** ఎలివేటెడ్ కారిడార్ పూర్తయితే మేడ్చల్ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం సహకరించడంతో కేంద్రం కూడా తమకు సహకరించిందని వివరించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో హైదరాబాద్‌లో ఏదైనా ఒక శాశ్వత అభివృద్ధి పనిని చేశారా? అని ప్రశ్నించారు. ఉత్తర తెలంగాణ అభివృద్ధి చెందాలంటే ఎలివేటెడ్ కారిడార్ పూర్తవ్వాలని అన్నారు. ప్రజల అవసరాల కోసమే ఒక మెట్టు దిగానని.. రాజకీయాల కోసం కాదని చెప్పారు. ఈ నగరంలో ఏదైనా అభివృద్ధి జరిగిందంటే అది కాంగ్రెస్ పాలనలోనే అని తెలిపారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో గంజాయి, డ్రగ్స్, పబ్బులు తప్ప ఏం అభివృద్ధి చేశారని నిలదీశారు. ఈ ఎలివేటెడ్ కారిడార్ ఉత్తర తెలంగాణ అభివృద్ధికి ముఖద్వారంగా నిలుస్తుందని తెలిపారు. అభివృద్ధి కోసం భవిష్యత్‌లోనూ కేంద్రాన్ని అడుగుతూనే ఉంటామని.. కేంద్రం సహకరించకపోతే కొట్లాడుతామని అన్నారు. ఈ నగరాన్ని అంతర్జాతీయ నగరంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే రాజకీయాలని.. ఎన్నికలు ముగిశాక అభివృద్ధి తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో కంటోన్మెంట్ ప్రాంతాన్ని కూడా అభివృద్ధి చేస్తామని తెలిపారు. తమ పోరాటం ఫలించిందని మాజీమంత్రి కేటీఆర్ అంటున్నారు... ఆయన ఏం పోరాటం చేశారని ప్రశ్నించారు. X (ట్విట్టర్)లో వ్యంగంగా పోస్టులు పెట్టుడు తప్పితే ఆయన చేసిందేమిలేదని ధ్వజమెత్తారు.

తాము కేంద్రం నుంచి అనుమతులు తీసుకొస్తే కేటీఆర్ పోరాటం చేశారని చెప్పుకుంటున్నారని విరుచుకుపడ్డారు. హైదరాబాద్ నగర అభివృద్ధి కోసం ఇందిరా పార్కు వద్ద కేటీఆర్ ఆమరణ దీక్ష చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.



## 15 నుంచి తెలంగాణలో ఒంటిపూట బడులు

హైదరాబాద్: ఎండ తీవ్రత పెరుగుతున్న క్రమంలో మార్చి15 నుంచి ఒంటి పూట బడులు నిర్వహించాలని తెలంగాణ విద్యాశాఖ నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటలకు పాఠశాలల వేళలు నిర్ణయించింది.

రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ స్కూళ్లు ఒంటిపూట బడులు నిర్వహించాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. అయితే పదో తరగతి పరీక్షలు జరిగే పాఠశాలలో మాత్రం మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 5 గంటల వరకు క్లాసులు నిర్వహించాలని ప్రభుత్వం పేర్కొంది. 10వ తరగతి పరీక్షలు ముగిసిన తర్వాత మళ్లీ ఉదయం పూటే ఆయా బడులు నడుస్తాయి.

## చీకటి ఒప్పందాలు జరిగాయా!?




హైదరాబాద్ : తెలంగాణలో సంచలనం సృష్టించిన టానిక్ లిక్కర్ కేసుకు సంబంధించి తాజాగా తెలంగాణ వైన్ డీలర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వెంకటేశ్వరరావు కొన్ని సంచలన విషయాలు బయటపెట్టారు. 2016లో టానిక్ సంస్థ కోసం ఒక చీకటి జీవో తీసుకొచ్చారని.. వైన్ డీలర్స్‌కు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే పైలెట్ ప్రాజెక్టు కింద టానిక్ సంస్థకు అనుమతులు ఇచ్చారని పేర్కొన్నారు. రాష్ట్రంలో కేవలం టానిక్ సంస్థకు మాత్రమే 13.6% టాక్స్ కట్టకుండా వెసులుబాటు కల్పించారని చెప్పారు. అప్పటి ఎక్సైజ్ కమిషనర్ చంద్రవదన్, ప్రిన్సిపల్ సెక్రటరీ సోమేశ్ కుమార్ కలిసి.. అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపణలు గుప్పించారు. స్పెషల్ జీవోపై తాము మేము తెలంగాణ హైకోర్టులో పిటిషన్ వేయగానే.. రాత్రికి రాత్రి రూల్స్ ఫ్రేమ్ చేసి, లైసెన్సులు మంజూరు చేశారని వెంకటేశ్వరరావు తెలిపారు. అందులో టానిక్ సంస్థ లబ్ధి పొందేలా ఐదు సంవత్సరాల పాటు 'టాక్స్ ఫ్రీ'తో పాటు 18 డిపోల నుంచి వైన్‌ను దిగుమతి చేసుకునేలా సౌకర్యం కల్పించారని అన్నారు. మిగిలిన వారికి మాత్రం.. కేవలం తమకు కేటాయించిన డిపోలలో మాత్రమే దిగుమతి చేసుకొనేలా ఆదేశాలిచ్చారని చెప్పారు. దీని ద్వారా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం.. కోట్ల రూపాయల్లో నష్టం వాటిల్లిందని వివరించారు. కేవలం టానిక్ సంస్థకు మాత్రమే ఈ స్పెషల్ జీవో వర్తించేలా.. ఎందుకు తీసుకొచ్చారో అర్థం కావడం లేదని అనుమానం వ్యక్తం చేశారు. మిగిలిన షాపులతో పోలిస్తే.. టానిక్ షాప్‌లకు రెండు గంటలు అదనంగా అమ్మకాలు చేసుకునేలా వెసులుబాటు కల్పించారని వెంకటేశ్వరరావు చెప్పారు. దీని వల్ల మిగిలిన వ్యాపారవేత్తలకు తీవ్రంగా నష్టం జరిగిందన్నారు. ఫారిన్ లిక్కర్ కూడా 18 డిపోల నుంచి టానిక్ సంస్థ దిగుమతులు చేసుకునేలా ఆ జీవోలో ఉందన్నారు. దీనిపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విచారణ జరిపి, తగిన చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నామని చెప్పారు. ఇదిలావుండగా.. ఏడేళ్లుగా టానిక్ వైన్ షాప్ నిర్వాహకులు వందల కోట్ల రూపాయల ట్యాక్స్ ఎగ్గొట్టినట్లు ప్రాథమికంగా తేలింది. దీనిపై ఎందుకు చర్యలు తీసుకోలేదన్న కారణాలపై ప్రభుత్వం విచారణ చేపట్టింది.

# రేవంత్ సర్కార్‌ను కూల్చం

## ఐదేళ్లు ఉండాల్సిందే!: కేటీఆర్




కరీంనగర్: కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బయటి నుంచి ఎవరో కూల్చరని.. ప్రభుత్వాన్ని పడగొట్టేవాళ్లు ఆ పార్టీలోనే ఉన్నారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు సంచలన వ్యాఖ్యలు చేశారు. గురువారం కరీంనగర్ పార్లమెంట్ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డితో పాటు బండి సంజయ్‌పైనా మండిపడ్డారు. కరీంనగర్ నుంచే పార్లమెంట్ జంగ్ సైరన్ మోగబోతోంది. కేసీఆర్‌కు కరీంనగర్ అంటే సెంటిమెంట్. నాటి ఉద్యమ కాలాన సింహగర్జన సభకు కరీంనగరే వేదికైంది. ఇప్పుడు రేవంత్ రెడ్డి పాలనపై కూడా కదనభేరి సభ కరీంనగర్ నుంచే మొదలు కాబోతోంది. ప్రధాని వచ్చి ఏదో హడావిడి చేసే ప్రయత్నం చేశారు. రేవంత్ రెడ్డి అధికారంలో ఉండి ఎందుకు ఫ్రస్ట్రేట్ అవుతున్నారో నాకు తెలీదు. జేబులో కత్తెర పెట్టుకుని తిరుగుతాననేటోడు మన ముఖ్యమంత్రి. ఓ జేబు దొంగలా మాట్లాడుతున్నాడు. అవి సీఎం స్థాయిలో మాట్లాడే మాటలేనా..? "రేవంత్‌రెడ్డి బీపీ పెంచుకోకు. మా వైపు నుంచి నీకు నష్టం లేదు. నీ ప్రభుత్వాన్ని కూల్చం. ఐదేళు నువ్వు అధికారంలో ఉండాలని కోరుకుంటాం. అప్పుడే వెలుగు చీకట్లకు తేడా తెలుస్తుంది. మీ ప్రభుత్వాన్ని కూల్చే ఖమ్మం, నల్లగొండ మానవ బాంబులు మీ పార్టీలోనే ఉన్నాయి. ఇంతకీ అబద్ధపు 420 హామీలు ఎప్పుడు అమలు చేస్తారు?" .. మానవబాంబులైతామంటున్నాడు రేవంత్. కానీ, ఆయన పక్కనే బాంబులున్నై, అది ఆయన గమనించుకుంటే చాలు. ప్రజలకు కూడా అర్థం కావాలి గాడిదేదో, గుర్రమేదో. చార్సవ్ బీస్ హామీలు అమలు కాకపోతే నిలదీస్తాం. రైతుబంధును రైతుభరోసా అన్నాడు. వచ్చిందా మరి..?. రైతులే ఇప్పుడు రేవంత్ పాలనపై చర్చకు పెడుతున్నారు.. మగాడివైతే రా నువ్వు నిలబడ్డ మల్కాజిగిరికి రా.. నేను వస్తానని సవాల్ విసిరా. కానీ, ఆ ఊసే మాట్లాడుతలేడు. మగాడివైతే ఇచ్చిన హామీలను నెరవేర్చి చూపాలని రేవంత్ కు సవాల్ విసురుతున్నా.. ఆత్మగౌరవం కల్గిన ఏ తెలంగాణా బిడ్డ మాట్లాడని మాటలు మోడీ ఎదుట సాగిలబడి రేవంత్ మాట్లాడుతుండు. రాహూల్ ఏమో గుజరాత్ మాడల్ ను తిడితే.. నువ్వేమో పొగుడ్తావా..?. 90 రోజుల్లోనే ప్రజాభిమానాన్ని కోల్పోయింది రేవంత్ ప్రభుత్వం. ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు.

పైనున్న ప్రాంతాలకు నీళ్లు తెచ్చే ఒక విజన్ తో కేసీఆర్ అద్భుతమైన కాళేశ్వరం కట్టాడు. రేవంత్, సంజయ్ వంటి పిచ్చోళ్లకు ఇవన్నీ తెల్వవ్. ప్రాజెక్ట్ లో చిన్న సమస్య వేస్తే రిపేర్ చేయకుండా కేసీఆర్ పై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారు. కరువు మీద కేసీఆర్ సంధించిన బ్రహ్మాస్త్రమే కాళేశ్వరం ప్రాజెక్ట్. మహానుభావులు ఎంపీలుగా గెలిచిన ఈ ప్రాంతం నుంచి బండి అడ్డిమారిగా గెల్చిండు. ఏం మాట్లాడుతాడో ఆయనకే తెల్వదు. దమ్ముంటే బండి సంజయ్ కరీంనగర్ కమాన్ దగ్గరకు రా. మా వినోద్ అన్న ఏం చేసిండో.. నువ్వేం చేసినావో తేల్చుకుందాం. బండి సంజయ్ ఓ సైకో లెక్క తిట్లు తప్ప చేసిందేమీ లేదు. శివలింగం మీద తేలులాగా పైన రాముడు కింద బండి సంజయ్. పొన్నంను మీ అమ్మకే పుట్టినావా అనే చిల్లరగాడు ఎంపీగా అవసరమా అంటూ సంజయ్ పై ఫైర్. బీఆర్ఎస్ బీజేపీ బీ టీమ్ ఐతే కవితపై అసలు కేస్ ఎందుకు అయ్యేది..? కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తూ లబ్ది పొందాలని ప్రయత్నిస్తోంది. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటు వేస్తే అది బీజేపీ గెలుపుకు కారణమవుతుందనేది అంతా గమనించాలి. ఎన్నికల తర్వాత రేవంత్ మరొక ఏక్ నాథ్ షిండే, హిమంత బిశ్వాస్ శర్మ కాబోతున్నాడనేది గ్యారంటీ" అని కేటీఆర్ విమర్శలు గుప్పించారు.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## గూగుల్ ప్రకటనల్లో ఏ పార్టీ ఖర్చు ఎంతంటే...?

ఎన్నికల సమయంలో అభ్యర్థి గుణగణాలు, సేవా ధృక్పథం, పోటీ చేస్తున్న పార్టీ... ఇవన్నీ ఒకెత్తు అయితే తాను చేసుకునే ప్రచారం మరొకెత్తు! ఒక్క మాటలో చెప్పాలంటే... ఎంత ఎక్కువ ప్రచారం చేసుకుంటే అంత ఫాలోయింగ్ పెరగడం, ఆ ఫాలోయింగ్ ఓట్లుగా మారుతుండటం జరుగుతుంటుందని అంటుంటారు. అలా అని కేవలం ప్రచారం మాత్రమే ఓట్లు తీసుకురాదు కానీ... ఓట్లు తీసుకొచ్చే విషయంలో ప్రచారం కీలక భూమిక పోషిస్తుందని మాత్రం చెప్పొచ్చు! ఈ క్రమంలో తాజాగా గూగుల్ యాడ్స్ ఖర్చులో ఏ పార్టీ ఏ ప్లేస్ లో ఉందనే విషయాలు తెరపైకి వచ్చాయి. ఇందులో భాగంగా గూగుల్ ప్రకటనలకోసం ఖర్చు చేసే పార్టీల్లో బీజేపీ అగ్రస్థానంలో ఉంది. 2023 రాష్ట్ర ఎన్నికల సమయంలో ఆ పార్టీ సుమారు రూ.19 కోట్లు కేటాయించింది. దీంతో ఈ విషయంలో టాప్ ప్లేస్ లో నిలిచింది. గత ఏడాది తొమ్మిది రాష్ట్రాల్లో జరిగిన శాసనసభ ఎన్నికల సమయంలో గూగుల్ ప్రకటనల కోసం బీజేపీ ఈ స్థాయిలో భారీగా ఖర్చు చేసింది. గూగుల్ ప్రకటనల పారదర్శక డేటా ప్రకారం 2023లో బీజేపీ రూ.19 కోట్లు ఖర్చు చేసిందని చూపిస్తుంది. దేశాన్ని పాలిస్తున్న పార్టీగా... వారు చేసిన పనులను, సాధించిన విజయాలను హైలెట్ చేస్తూ భారీ ఎత్తున ప్రకటలను ఇచ్చింది. ఈ క్రమంలో ఈ ఏడాది జరగనున్న లోక్ సభ ఎన్నికల ఖర్చును విపరీతంగా పెంచబోతుందని తెలుస్తుంది. వాస్తవానికి 2019 లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ గూగుల్ రూ. 17 కోట్లు ఖర్చు చేయగా.. ఈ ఏడాది అది భారీగా పెరిగే అవకాశం ఉందని అంటున్నారు. 2023లో జరిగిన పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధానంగా కర్ణాటక రాష్ట్రంలో గూగుల్ ప్రకటనల కోస్సం రూ. 7.2 కోట్లు ఖర్చు చేయగా... మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్ గఢ్ రాష్ట్రాల్లో గూగుల్ ప్రకటనల కోసం బీజేపీ రూ.7.71 కోట్లు ఖర్చు చేసింది. ఇదే క్రమంలో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల కోసం బీఆరెస్స్ పార్టీ రూ.12.1 కోట్లు ఖర్చు చేసి రెండోస్థానంలో నిలిచింది! ఇక కాంగ్రెస్ పార్టీ రూ.4.59 కోట్లు ఖర్చు చేయగా.. ఇందులో మొత్తం కర్ణాటక ఎన్నికల సమయంలోనే ఖర్చు చేసింది! మిగిలిన రాష్ట్రాల్లో అతితక్కువగా ఖర్చు చేసింది. ఇక ఈ ఏడాది జనవరి 1 నుంచి మార్చి 3 వరకూ తెలంగాణలో రూ.2.6 కోట్ల ప్రకటనలు రాగా... అందులో బీజేపీ రూ.1.1 కోట్లతో అగ్రస్థానంలో కొనసాగుతుండగా... సీబీసీ రూ. 50 లక్షలు, ఐప్యాక్ రూ.60 లక్షలు, టీడీపీ రూ.13 లక్షలు ఖర్చు చేశాయి. ఇక ఏపీ విషయానికొస్తే... ఇక్కడ 4.2 కోట్ల రూపాయల ప్రకటనలు రాగా వాటిలో ఐప్యాక్ రూ. 2.5 కోట్లు, బీజేపీ రూ.65 లక్షలు, సీబీసీ రూ.63 లక్షలు, టీడీపీ రూ.13 లక్షలు, వైసీపీ రూ.11 లక్షలు ఖర్చు చేశాయి. ఈ క్రమంలో ఓవరాల్ గా దేశవ్యాప్తంగా బీజేపీ సుమారు రూ.30 కోట్లను ఈ ప్రకటనల కోసం ఖర్చు చేసినట్లు తెలుస్తుంది.

# రూ.కోట్ల నిధులు.. తాత్కాలిక పనులు



వేములవాడ: దక్షిణ కాశీగా పేరొందిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో ఏటా జరిగే మహాశివరాత్రి జాతరకు ఏటా కోట్లాది నిధులు ఖర్చు చేస్తున్నప్పటికీ తాత్కాలిక పనులతోనే సరిపెడుతున్నారు. మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించే శివరాత్రి వేడుకలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు లక్షల్లో వస్తుంటారు. వీరికి ఏర్పాటు చేసే తాత్కాలిక సౌకర్యాలు సరిపోవడం లేదు. ముఖ్యంగా స్వామివారి దర్శనానికి క్యూలైన్లలోకి వెళ్లిన భక్తులకు పూర్తి స్థాయి సౌకర్యాలు లేక ఇబ్బందులు తప్పడం లేదు. అత్యవసరంగా బయటకు రావడానికి ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి భక్తులను ఆందోళనకు గురి చేస్తోంది. చాలా వరకు క్యూలైన్లలో భక్తులు గంటల తరబడి వేచి ఉండి కళ్లు తిరిగి పడిపోయిన సందర్భాలు కూడా జరుగుతున్నాయి.రాజన్న ఆలయంలో ఏ అభివృద్ధి పని చేపట్టాలన్న మాస్టర్ ప్లాన్ అడ్డంకిగా మారిందని ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు. దీంతో భక్తుల సౌకర్యం కోసం శాశ్వత నిర్మాణాలు చేపట్టడం లేదు. ప్రతి సంవత్సరం ఆలయంలో జరిగే మహాశివరాత్రి జాతరకు రెండున్నర కోట్ల రూపాయలకు పైగా నిధులు ఖర్చు చేస్తున్నారు. ఇందులో భక్తులు జాగరణ చేసేందుకు చలువ పందిళ్లు, పెండాళ్లు, బారికేడ్లు, శివార్చన, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ వేదిక, తాత్కాలిక మరుగుదొడ్లు, మూత్రశాలలు, క్యూలైన్ల నిర్వహణ, నీటి వసతి, పారిశుద్ధ్యం వంటి పనుల నిర్వహణకు నిధులు వెచ్చిస్తున్నారు. వీటిలో కొన్ని శాశ్వతంగా ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ మాస్టర్ ప్లాన్ అడ్డంకిగా మారుతోంది. దీంతో భక్తులకు సౌకర్యాలు సమకూరడం లేదు.

మాస్టర్ ప్లాన్ అమలు కాక...

రాజన్న ఆలయం, పరిసరాల్లో అభివృద్ధి పనులను వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (వీటీఏడీఏ) మాస్టర్ ప్లాన్ ప్రకారం చేయాల్సి ఉంది. మాస్టర్ ప్లాన్ అమలు కాకపోవడంతో భక్తుల వసతుల కోసం తాత్కాలిక పనులు చేపట్టడం జరుగుతోంది.– రఘునందన్, డీఈ, రాజన్న ఆలయం

ఎట్టకేలకు శివార్చన వేదిక నిర్మాణం

మహాశివరాత్రి జాతర సందర్భంగా భక్తులు జాగరణ చేస్తుంటారు. దీంతో పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తుంటారు. ఇందుకు ఏటా దాదాపు రూ. కోటి వరకు వరకు నిధులు ఖర్చు చేసి తాత్కాలిక ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకు అవసరమైన శివార్చన వేదిక శాశ్వత నిర్మాణానికి ఆలయ అధికారులు ప్రతిపాదించి రూ.9 లక్షల నిధులతో నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఈ వేడుకలను నూతనంగా నిర్మిస్తున్న వేదికపై నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు భక్తుల వాహనాలు పార్కింగ్ స్థలానికి వచ్చేందుకు వీలుగా పార్కింగ్ స్థలంలో రోడ్డు ఏర్పాటు చేస్తున్నారు. శాశ్వతంగా ఎక్కడైన ఏర్పాటు చేసే విధంగా మూత్రశాలలు, మరుగుదొడ్ల కంటైనర్లను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా భక్తుల క్యూలైన్లను ఆధునికీకరించడంతోపాటు సౌకర్యాలను మెరుగుపరచడం వంటి శాశ్వత నిర్మాణాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వృద్ధులు, దివ్యాంగులు, చిన్నారులతో వచ్చిన వారికి ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు వంటివి చేయాల్సిన అవసరం ఉంది.

# వంద శాతం లక్ష్యానికి చేరువగా ఉత్పత్తి!

కొత్తగూడెం : సవరించిన బొగ్గు ఉత్పత్తి వార్షిక లక్ష్యాన్ని అధిగమించేందుకు సింగరేణి సంస్థలో అవకాశాలు మెరుగయ్యాయి. తొలుత 75 మిలియన్ టన్నులు ఉత్పత్తి చేయాలని యాజమాన్యం నిర్ణయించింది. కానీ, నైనీబ్లాకు, వీకే ఓసీ తదితర గనుల్లో ఈ ఏడాది ఉత్పత్తి ప్రారంభించలేదు. దీంతో లక్ష్యాన్ని 75 నుంచి 70 మి.ట.కు కుదించింది. అంతకు ముందు కేవలం 91 శాతం ఉత్పత్తికి చేరువలో ఉండగా, లక్ష్యాన్ని సవరించిన నేపథ్యంలో నాటికి సింగరేణి 99 శాతానికి చేరినట్లయింది. ఫిబ్రవరిలో నూరు శాతం బొగ్గు ఉత్పత్తి జరగడం మరో విశేషం. ఈ ఉత్పత్తి సంవత్సరంలో మరో 30 రోజులు మిగిలి ఉన్నాయి. ప్రస్తుతం రోజుకు 1.4 నుంచి 1.6 లక్షల టన్నుల బొగ్గు వెలికితీస్తున్నారు. ఈ మొత్తాన్ని కొంచెం పెంచగలిగితే మిగతా ఉత్పత్తి లక్ష్యాన్ని నెలాఖరులోగా చేరుకోవడం సులువు అవుతుందని యాజమాన్యం భావిస్తోంది. ఈ దిశగా ఎప్పటికప్పుడు ఏరియా అధికారులతో సమీక్షలు నిర్వహిస్తోంది.

వార్షిక లక్ష్యంలో..: సింగరేణివ్యాప్తంగా ఐదు ఏరియాలు వార్షిక లక్ష్యాన్ని సాధించాయి. వీటిల్లో మూడు ఏరియాలు ఉభయ జిల్లాలకు చెందినవే. వాటిల్లో కొత్తగూడెం 110 శాతం, ఇల్లెందు, మణుగూరు ఏరియాలు 105 శాతం ఉత్పత్తితో వరుసగా మూడు స్థానాల్లో నిలిచాయి. మిగతా ఏరియాల్లో చూస్తే బెల్లంపల్లి 110, రామగుండం(3) 105,



రామగుండం(1) 99, రామగుండం(1) 98, మందమర్రి 88, శ్రీరాంపూర్ 86, అడ్రియాల 83, భూపాలపల్లి ఏరియా 69 శాతం వార్షిక లక్ష్యాన్ని సాధించాయి. సింగరేణివ్యాప్తంగా ఈ సంవత్సరం ఇప్పటి వరకు 6,31,41,100కి గాను 6,27,22,556 టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగింది.

గత నెలలో..: ఫిబ్రవరి మాసం లక్ష్యాల్ని సింగరేణిలోని మొత్తం ఆరు ఏరియాలు చేరుకున్నాయి. ఈ ఒక్కనెలలో ఉత్పత్తిని చూస్తే.. రామగుండం (3) 141 శాతం ఉత్పత్తితో కంపెనీ స్థాయిలోనే అగ్రభాగాన నిలిచింది. ఆ తర్వాత రామగుండం(1) 129 శాతంతో ద్వితీయ స్థానంలో ఉంది. రామగుండం (2) ఏరియా 109, అడ్రియాల ప్రాజెక్టు 108, శ్రీరాంపూర్ 107, కొత్తగూడెం 106, భూపాలపల్లి 92, మందమర్రి 90 శాతం, ఇల్లెందు 87, మణుగూరు 80 శాతం నెలవారీ లక్ష్యాలను అందుకున్నాయి.

# ప్రైవేటులో అమ్మకు కడుపు కోతలు



కరీంనగర్ : ఓ వైపు గర్భిణులకు సాధారణ ప్రసవాలు చేసి తల్లి, బిడ్డ క్షేమంగా ఉండేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వం ప్రత్యేక ఆదేశాలు జారీ చేసింది. మరో వైపు ఆ ఆదేశాలు బేఖాతర్ చేస్తూ.. పలు ప్రైవేటు ఆసుపత్రులు శస్త్రచికిత్సలు (కడుపు కోతలు) అధికంగా చేస్తున్నాయి. దీనిని సీరియస్‌గా తీసుకున్న జిల్లా అధికారులు ఇటీవల ఏడు ఆసుపత్రులకు తాఖీదులు జారీ చేశారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు పెరిగినా ప్రైవేటులో ఆ పరిస్థితి లేదు. కోతల ద్వారా ప్రసవాలు చేసి పెద్ద మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ప్రస్తుతం 86 శాతం సిజేరియన్లు చేసినట్లుగా వైద్య ఆరోగ్య శాఖ అధికారిక లెక్కలు చెబుతున్నాయి. గతంలో మాదిరిగా కనీసం 75 శాతం తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశాలలో ఆదేశాలు జారీ చేశారు. 11 నెలల వ్యవధిలో ప్రైవేటు, ప్రభుత్వాసుపత్రుల్లో మొత్తం 10,698 ప్రసవాలైతే సాధారణం 3,146 కాగా, శస్త్రచికిత్సలు 7,552 ఉన్నాయి.

ప్రభుత్వాసుపత్రిలో సాధారణ ప్రసవాలు

కరీంనగర్ మాతా శిశు కేంద్రం, హుజూరాబాద్, జమ్మికుంట వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యమిస్తున్నారు. అవసరమైన కౌన్సెలింగ్‌తో అవగాహన కల్పిస్తున్నారు. తప్పని పరిస్థితిలోనే శస్త్రచికిత్సలు చేస్తున్నారు. ఫలితంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెరుగుతోంది.

వాటిలో శస్త్రచికిత్సలకు ప్రాధాన్యం

జిల్లాలో మొత్తం 45 ప్రైవేటు ప్రసవ ఆసుపత్రులు ఉండగా, 33లో రోజూ నిర్వహిస్తారు. గత నెలలో ప్రైవేటు దవాఖానాల్లో కోతలపై సమీక్షించిన జిల్లా కలెక్టర్ తనిఖీ చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించా ఏడు ఆసుపత్రులకు తాఖీదులురు. రెండు నెలల వ్యవధిలో 24 ప్రైవేటు ఆసుపత్రులను వైద్యాధికారుల బృందాలు తనిఖీ చేశాయి. ఏడింటిలోనే సాధారణ ప్రసవాలకు, సుమారు పదింటిలో కేవలం శస్త్రచికిత్సలకే ప్రాధాన్యం ఇచ్చినట్లు తనిఖీ సమయంలో బయటపడింది. ఈ లెక్కన ప్రైవేటులో సాధారణ ప్రసవాలు జరగడం లేదని తేలింది. నోటీసులతో సరిపెట్టకుండా కఠిన చర్యలు తీసుకుంటేనే ప్రైవేటు ఆసుపత్రుల్లో మార్పు వస్తుంది.

కఠిన చర్యలు తప్పవు

గత రెండు నెలల్లో సిజేరియన్ల ద్వారా ప్రసవాలకు ప్రాధాన్యం ఇచ్చిన ఏడు ఆసుపత్రులకు గత నెల 28న షోకాజ్ నోటీసులు జారీ చేశాం. వారి సమాధానం ప్రకారం చర్యలు తీసుకుంటాం. సాధారణానికి ప్రాధాన్యం ఇవ్వకపోతే కఠిన చర్యలు తప్పవు. ఇక ప్రతి నెలా నివేదికలు తెప్పించుకొని సమీక్షించాలని ప్రభుత్వం ఆదేశించింది.
– డాక్టర్ సుజాత, డీఎంహెచ్‌వో, కరీంనగర్

# బిల్లులు రాక.. బడిరూపు మారక


మెదక్ : సర్కారు పాఠశాలల రూపురేఖలు మార్చేందుకు చేపట్టిన 'మన ఊరు–మనబడి' కార్యక్రమ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. చేపట్టిన పనులకు బిల్లులు రాకపోవడంతో పనులు అసంపూర్తిగా నిలిచిపోయి విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. బిల్లులు రాకపోవడంతో గుత్తేదారులు పనులు చేపట్టేందుకు ఆసక్తి చూపలేదు. కొన్నిచోట్ల ముందుకు వచ్చినా.. చేసిన పనులకు నిధులు రాక చేతులెత్తేశారు. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో ఈ పనులపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఈ అంశంపై పరిశీలనాత్మక కథనం... జిల్లాలో తొలివిడతలో 180 ప్రాథమిక, 44 ప్రాథమికోన్నత, 89 ఉన్నత పాఠశాలలను ఎంపిక చేశారు. ఒకటి మినహా మిగిలిన పాఠశాలల్లో పనులు చేపట్టేందుకు రూ.65.02 కోట్లు అంచనా వేశారు.

రూ.23.44 కోట్లే మంజూరు...

పనుల పురోగతి ఆధారంగా నిధులు విడుదల చేయాలని నిర్ధేశించారు. ఎంపిక చేసిన పాఠశాలల్లో శౌచాలయం, విద్యుత్తు సరఫరా, తాగునీటి వసతి, ఫర్నీచర్, రంగులు, మరమ్మతులు, వంటగది, అదనపు తరగతి గదుల నిర్మాణం, ఉన్నత పాఠశాలల్లో డైనింగ్ హాల్స్, డిజిటల్ తరగతుల నిర్వహణకు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. 312 పాఠశాలల్లో పనులు మొదలు పెట్టగా.. ఇప్పటి వరకు రూ.23.44 కోట్లు మాత్రమే మంజూరయ్యాయి. ఇంకా బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో పనులు ఆపేశారు.

జిల్లాలో పరిస్థితి ఇలా...

నర్సాపూర్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు రూ.23లక్షలు మంజూరు కాగా, వీటితో డైనింగ్ హాలు, విద్యుదీకరణ, వాష్‌బేసిన్, నీటి ట్యాంకులు నిర్మించాల్సి ఉంది. సుమారు రూ.16 లక్షల వరకు పనులు పూర్తిచేసిన గుత్తేదారుకు పైసా రాలేదు. దీంతో ఆరు నెలల క్రితం పనులు నిలిపివేశారు. ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాలలో వంటగది నిర్మాణం పనులు ఆరు నెలలుగా అసంపూర్తిగా ఉన్నాయి.



ఇందుకోసం రూ.15లక్షల నిధులు కేటాయించారు. చేసిన పనులకు రూ.13లక్షల బిల్లుల కోసం ఐదు నెలలుగా ఎదురుచూపులు తప్పడం లేదు. మాసాయిపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదులు, భోజనశాల నిర్మాణానికి రూ.95 లక్షలు మంజూరయ్యాయి. గుత్తేదారు సగం పనులు చేసి అసంపూర్తిగా వదిలేశారు. ః శివ్వంపేటలోని ప్రాథమిక పాఠశాలలో ఆయా పనులకు రూ.30 లక్షలు మంజూరయ్యాయి. రూ.10 లక్షలతో భవనం నిర్మించి, బిల్లులు రాలేవని ఇతర పనులను నిలిపివేశారు.

చేగుంట మండలం మక్కరాజుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో భోజనశాల అసంపూర్తిగా ఉంది. ఆరు నెలల కింద గుత్తేదారు పనులను నిలిపివేశారు.నిధులు రాకపోవడంతో..: రాధాకిషన్, జిల్లా విద్యాధికారి మొదటి విడతలో చేపట్టిన పనులకు కొంత బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. గత కొద్ది నెలలుగా రావడం లేదు. దీంతో పనులు చేయాలని గుత్తేదారుపై ఒత్తిడి చేయలేకపోతున్నాం. మన ఊరు–మన బడిపై త్వరలో సీఎం సమీక్ష ఉంటుందని సమాచారం ఉంది. ఇది జరిగితేనే పురోగతి తెలుస్తుంది.

# అంతటా పెరిగి.. రేకుర్తిలో తగ్గి!

కరీంనగర్ : రెండేళ్లకు ఒకసారి జరిగే వనదేవతలు సమ్మక్క–సారలమ్మ జాతర ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఊహించినట్లుగానే భక్తులు అన్ని చోట్ల పోటెత్తారు. కోరిన కోరికెలు తీర్చే కొంగు బంగారంగా కొలిచి ముడుపులు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. బంగారు, వెండితోపాటు నగదు కానుకలు సమర్పించారు. ఉమ్మడి జిల్లాలో దాదాపు 42 అమ్మవారి గద్దెలు ఉన్నాయి. గోదావరిఖని, గోయల్‌వాడ ప్రాంతాల్లో పెద్దపల్లి జిల్లాతోపాటు ఆదిలాబాద్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల భక్తులు దర్శించుకున్నారు. రేకుర్తి, కేశవపట్నం, వీణవంక, జమ్మికుంట, నీరుకుల్లా, తదితర ప్రాంతాలకు కరీంనగర్ జిల్లాతోపాటు జగిత్యాల, రాజన్న సిరిసిల్ల వారు వచ్చారు. గత మూడు జాతరల ఆదాయం పోల్చుకుంటే ఈ సారి అంతటా పెరిగినా రేకుర్తిలో మాత్రం తగ్గింది. ఏకంగా రూ.7 లక్షల వరకు తగ్గడం ఆశ్చర్యం కల్గిస్తోంది. గతంతో పోల్చితే రేకుర్తిలో వసతులు తగ్గడం, చుట్టూ ఇళ్లు వెలవడంతో ఎక్కువ మంది రాలేదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఏటా పెరుగుతున్న భక్తజనం..ఉమ్మడి జిల్లాలో సమ్మక్క, సారలమ్మ జాతరకు వెళ్లే భక్తులు పెరగడంతోపాటు ఆదాయం పెరుగుతోంది. కొన్ని చోట్ల ఈవో స్థాయి అధికారుల పర్యవేక్షణ ఉండగా మరికొన్ని చోట్ల మేనేజర్, క్లర్క్ స్థాయి అధికారులు పర్యవేక్షించారు. కొన్ని చోట్ల అధికారులు నామమాత్రంగా వ్యవహరించడంతో భక్తుల సొమ్ము నిర్వాహకుల చేతుల్లోకి వెళ్లింది. ఉమ్మడి జిల్లాలో దాదాపు 32 వరకు



అధికారికంగా జాతర ఉత్సవాల కమిటీలు ఉండగా, మరో పది అనధికారికంగా ఉన్నాయి. అన్ని చోట్ల కలిపి 40–50 లక్షల మంది భక్తజనం దర్శించుకున్నట్లు అంచనా. ఒకప్పుడు కేవలం గిరిజన, సామాన్యులు, మధ్య తరగతి వారు ఎక్కువగా వెళ్లేవారు. ఇప్పుడు సబ్బండ వర్గాలు అమ్మవార్లను దర్శించుకొని తరిస్తున్నారు. ఏటా ఎక్కువ మంది దర్శించుకొనే జాతరలలో రేకుర్తి, నీరుకుల్లా(సుల్తానాబాద్), గోదావరిఖని, గోయల్‌వాడ, కేశవపట్నం ఉంటాయి. ఈ అయిదు చోట్ల రూ.కోటికి పైగా ఆదాయం వచ్చింది. అన్ని చోట్ల చూసుకుంటే ఉమ్మడి జిల్లాలోనే జాతర ఆదాయం దాదాపు రూ.2 కోట్ల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు.

# నెల రోజుల్లో పూర్తయ్యేనా!

ఇబ్రహీంపట్నం: గ్రామ పంచాయతీల్లో సీసీ రహదారులు, మురుగు కాల్వల నిర్మాణాల కోసం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు కేటాయించారు. నిధులు గత నెలలో కేటాయించగా మార్చి నెలాఖరులోగా పనులు చేపట్టాల్సి ఉంటుంది. పనులు పూర్తి చేయక పోతే నిధులు వెనక్కి మళ్లి పోనున్నాయి.

రూ.29 కోట్లతో 484 పనులు

జిల్లాలో 18 మండలాల్లోని గ్రామాల్లో ఉపాధి హామీ పథకం నిధులతో సీసీ రహదారులు, మురుగు కాల్వలు నిర్మించనున్నారు. జిల్లాలో మొత్తం 484 పనులను రూ.29.39 కోట్ల నిధులను కేటాయించారు. సీసీ రహదారులు, మురుగు కాల్వల నిర్మాణాల కోసం గుర్తించిన స్థలాలకు గ్రామ పంచాయతీల నుంచి తీర్మానాలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటికే కొన్ని పనులు మొదలు పెట్టి పూర్తి చేయగా. కొన్ని వివిధ దశల్లో ఉన్నాయి. అలాగే చాలా వరకు పనులు ప్రారంభమే కాలేదు. కోడ్ రాకముందే..సీసీ రహదారులు, మురుగు కాల్వల నిర్మాణానికి ఉపాధి హామీ పథకంలో 2023-2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నిధులను కేటాయించారు. ఈ పనులను నెల ముగిసేలోగా పూర్తి చేయాల్సి ఉంటుంది. లేదంటే నిధులు వెనక్కి మళ్లిపోనున్నాయి. దీంతో పలువురు ఇప్పటికే పనులు పూర్తి చేయగా, మరికొందరు చేపట్టడానికి



సన్నద్ధమవుతున్నారు. మొత్తం 484 పనులకు ఇప్పటికీ కేవలం 78 మాత్రమే పూర్తి కాగా ఇంకా 271 పనులు ఇప్పటికీ ప్రారంభం కాలేదు. త్వరలో లోక్‌సభ ఎన్నికల కోడ్ వచ్చే అవకాశం ఉంది. కోడ్ అమలులో ఉన్నప్పుడు అభివృద్ధి పనులను చేపట్టకూడదు. దీంతో పనులను ఎన్నికల కోడ్ రాకముందే ప్రారంభించాల్సి ఉంటుంది.

గడువులోగా పూర్తి చేయాలి

గ్రామాల్లో సీసీ రహదారులు, మురుగు కాలువల నిర్మాణాలను వెంటనే ప్రారంభించి, సకాలంలో పూర్తి చేయాలి. ఉపాధి హామీ పథకం నిధులు కేటాయించినందున మార్చి చివరిలోగా పనులు పూర్తి చేస్తేనే నిధులు వస్తాయి. ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తే కొత్త పనులను ప్రారంభించే అవకాశం ఉండదు. కాబట్టి త్వరగా పనులు ప్రారంభించి పూర్తిచేయాలి.- అన్వర్, డీఈఈ పంచాయతీ రాజ్

# ఇంకా మిగిలిపోయారు..!

నల్గొండ : ఆహారభద్రత కార్డులో సభ్యులుగా ఉన్నవారు ఈ- కేవైసీ చేయించుకోవడానికి ఫిబ్రవరి 29తో గడువు ముగిసింది. ఐదు నెలల పాటు ఈ ప్రక్రియ కొనసాగించారు. అయితే గడువు ముగిసే వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 8,17,802 మంది మిగిలిపోయారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపై వీరి పరిస్థితి ఆధారపడి ఉంటుంది. రేషన్ దుకాణాలకు వెళితే ఆధార్‌కార్డు అప్‌డేట్ చేయించుకుని రావాలని సూచించడం ఆశించిన స్థాయికి లక్ష్యం చేరుకోవడానికి కారణంగా చెప్పవచ్చు. ఆధార్‌ను అప్‌డేట్ చేయించినా కనీసం మూడు రోజుల నుంచి వారం రోజులపాటు నిరీక్షణ తప్పడం లేదు.

ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఇదీ పరిస్థితి..

ఉమ్మడి నల్గొండ జిల్లాలో మొత్తం 1,740 గ్రామ పంచాయతీలకు కలిపి మొత్తం 2,081 రేషన్ దుకాణాలున్నాయి. ఈ విషయమై ఎన్ఎఫ్ఎస్ఏ, ఎన్ఎఫ్ఎస్ఏ కలిపి మొత్తం 10,07,214 రేషన్ కార్డులుండగా, 29,85,553 మంది రేషన్ లబ్ధిదారులున్నారు. ఇప్పటి వరకు 21,67,731 మంది మాత్రమే ఈకేవైసీ అప్‌డేట్ చేయించుకున్నారు. ప్రభుత్వం విధించిన గడువు ముగియడంతో గ్రామాల్లో ఇంకా వందల సంఖ్యలో లబ్ధిదారులు మిగిలి ఉన్నారు. మొత్తంగా నల్గొండ జిల్లాలో 72.77 , సూర్యాపేట 72.57, యాదాద్రి భువనగిరి జిల్లాలో 72.31 శాతం ఈ కేవైసీ పూర్తి కావడం గమనార్హం.

మరోసారి అవకాశం ఇస్తే ప్రయోజనం..

పలు రకాల కారణాలతో రేషన్‌కార్డుల లబ్ధిదారుల ఈ కేవైసీని




చేయించుకోవడానికి కొంతమేర అసహనం వ్యక్తపరిచినట్లుగా తెలుస్తోంది. ఈ విషయమై ప్రభుత్వం మరోసారి గడువుకు అవకాశం ఇవ్వాలని లబ్ధిదారులు కోరుతున్నారు. అంతేగాక ఈ కేవైసీ చేయించుకునే విషయమై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తే ప్రయోజనం ఉంటుందంటున్నారు. ఇతర ప్రాంతాల్లో వలస ఉంటున్న వారికి కొవాణి ద్వారా సమాచారం అందించే ఏర్పాటు చేస్తే పూర్తిస్థాయిలో లక్ష్యం నెరవేరుతుందని పలువురు అంటున్నారు.

అధికారుల కమిటీ ఇలా...

చాలా మంది వృద్ధులు, వేలి ముద్రలు, కంటి పాపలు రావటం లేదు. దీంతో ప్రభుత్వం సమస్యలను అధిగమించి అర్హులందరికీ న్యాయం జరిగేలా ఉన్నతాధికారులతో కమిటీ ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేసింది. నిజమైన వలసదారులు, వేలి ముద్రలు సరిగా రాని వారిని కమిటీ అర్హులుగా గుర్తించి రేషన్ అందేలా చర్యలు తీసుకుంటుందని అధికారులు చెబుతున్నారు. కమిటీలో జిల్లా పాలానాధికారి, అదనపు పాలనాధికారి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్లు ఉన్నారు. వీరు అర్హులను గుర్తించి నమోదు ప్రక్రియ పూర్తి చేయనున్నారు. గడువు ముగిసినా అర్హుల నమోదుకు కమిటీ ఉపయోగపడుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

# పూర్తికాని పనులు.. నెరవేరని సొంతింటి కల



ముస్తాబాద్: పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు అప్పటి ప్రభుత్వం చేపట్టిన రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. పనులు చివరి దశకు చేరుకొని నెలలు తరబడినా ముందుకు సాగడం లేదు. దాదాపు అయిదు నెలల క్రితం గ్రామ సభలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేశారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పనుల్లో జాప్యం జరిగిందని సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఎన్నికలు పూర్తయి నెలలు గడుస్తున్నప్పటికీ పనులపై దృష్టి సారించక గ్రామాల్లో అసంపూర్తిగా నిలిచిపోయాయి. ముస్తాబాద్ మండలంలో ముస్తాబాద్, మోహినికుంట, మద్దికుంట, పోత్గల్, చిప్పలపల్లిగ్రామాల్లో రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశారు. అప్పటి మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభించారు. కొండాపూర్‌లో 40 ఇళ్లు నిర్మించారు. పనులు చివరి దశలో ఉన్నాయి. తలుపులు, కిటికీలు, ప్లంబింగ్, సెప్టిక్ ట్యాంకులు, పెయింటింగ్ పనులు మిగిలి ఉన్నాయి. గూడెంలో 48 ఇళ్ల నిర్మాణం పూర్తయ్యాయి. తలుపులు, కిటికీలు, వైరింగ్ వంటి చిన్న చిన్న పనులు మిగిలిపోయాయి. పనులు ప్రారంభించి త్వరగా పూర్తి చేసేలా సంబంధిత అధికారులు చొరవ చూపాలని లబ్ధిదారులు వేడుకొంటున్నారు.

పదిహేనేళ్లుగా అద్దె ఇంట్లో...

మాకు ఉండటానికి ఇల్లు లేదు. వ్యవసాయ భూమి లేదు. వ్యవసాయ కూలీలుగా పని చేస్తూ కాలం వెళ్లదీస్తున్నాం. పదిహేనేళ్లుగా అద్దె ఇళ్లలో ఉంటూ కాలం గడుపుతున్నాం. మంత్రి కేటీఆర్ పేదలకు రెండు పడక గదుల ఇళ్లు నిర్మించి ఇస్తున్నారని సంతోషించాం. మా గ్రామంలో ఇల్లు లేని వారికి నిర్మించి ఇస్తారంటే ఆనందపడ్డాం. గ్రామ సభలో లబ్ధిదారుగా మమ్మలను ఎంపిక చేశారు. నిర్మాణాలు మాత్రం ఇంకా పూర్తి కాలేదు. అధికారులు పనులు పూర్తి చేసి ఇల్లు అప్పగిస్తే మాకు అద్దె బాధలు తప్పుతాయి.- చిగురు పద్మ, కొండాపూర్

పనులు ప్రారంభించాలని సూచించాం

కొండాపూర్, గూడెం గ్రామాల్లో రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలు పూర్తయి చిన్న చిన్న పనులు చేయాల్సి ఉంది. కొండాపూర్‌లో తలుపులు, కిటికీలు, ప్లంబింగ్, పెయింటింగ్ పనులు మిగిలి ఉన్నాయి. గూడెంలో కిటికీలు, తలుపులు బిగించాల్సి ఉంది. రెండు గ్రామాల్లో సెప్టిక్‌ట్యాంకు పనులు చేపట్టాల్సి ఉంది. ఎన్నికల ముందు పనులు నిలిచిపోయాయి. తిరిగి పనులు ప్రారంభించి త్వరగా పూర్తి చేయాలని సదరు గుత్తేదారుకు సూచించ్చా. పనులు పూర్తి కాగానే అధికారుల చేతుల మీదుగా లబ్ధిదారులకు అప్పగిస్తాం.- నరేందర్, ఆర్‌అండ్‌బీ ఏఈ

# చేతి వృత్తులకు చేయూత



సిరిసిల్ల : చేతి వృత్తులు చేసుకుని జీవించేవారు ఆర్థికంగా స్థిరపడాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రధానమంత్రి విశ్వకర్మ పథకానికి స్పందన బాగుంది. జిల్లా వ్యాప్తంగా దాదాపు అన్ని పంచాయతీల నుంచి దరఖాస్తులు వచ్చాయి. వీటిని పరిశీలించి అర్హులను గుర్తించే పనిలో అధికారులు ఉన్నారు. ఈ ప్రక్రియ పూర్తయితే దరఖాస్తుదారులు లబ్ధి పొందే అవకాశం ఉంటుంది.

పీఎం విశ్వకర్మ పథకాన్ని కేంద్రం 2023 సెప్టెంబరు 17న ప్రారంభించింది. 2027-28 వరకు 5 సంవత్సరాల పాటు అమలు కానుంది. ఇది ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 3,116 మంది ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాలోని 255 గ్రామ పంచాయతీలకు గాను 231 గ్రామ పంచాయతీల్లో మాత్రమే నమోదు చేసుకున్నారు. మరో 24 గ్రామ పంచాయతీల్లో సాంకేతిక సమస్య కారణంగా సంబంధిత సర్వర్ ఓపెన్ కావడం లేదు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 3,116 దరఖాస్తులను సంబంధిత మండలాల ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు సంబంధిత లాగిన్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని వాటిని ఆయా గ్రామాల్లో పరిశీలన చేస్తున్నారు. ఇప్పటి వరకు 1,842 దరఖాస్తుల పరిశీలన పూర్తి కాగా, మరో 1,274 దరఖాస్తులను మరో రెండు రోజుల్లో పూర్తి చేయనున్నారు. దరఖాస్తుల పరిశీలన మూడు విడతల్లో జరగనుంది. మొదటి విడత గ్రామ స్థాయిలో, తర్వాత వాటిని కలెక్టర్ పరిశీలించిన అనంతరం రాష్ట్రస్థాయికి పంపించనున్నారు.

18 కులాల వారు అర్హులు..

వడ్రంగులు, రజకులు, దర్జీలు, కుమ్మరులు, కమ్మరులు, బంగారం పని చేసేవారు, నాయీబ్రాహ్మణులు, తాపీ పని వారు, చర్మకారులు, పడవలు, చెప్పులు, ఆయుధాలు, కవచ తయారీదారులు, సుత్తి, మరేదైన పరికరాలు, తాళాలు తయారు చేసేవారు, శిల్పులు, గంపలు, చీపుర్లు, పూలమాలలు, కొబ్బరి నారతో వస్తువులు, చేపలు పట్టే వలలు తయారు చేసేవారు అర్హులు.

రిజిస్ట్రేషన్ చేసుకునే విధానం

రిజిస్ట్రేషన్ చేసుకునే తేదీ నాటికి లబ్ధిదారుని కనీస వయసు 18 సంవత్సరాలు ఉండి, అతను రిజిస్ట్రేషన్ చేసుకునే పని చేస్తూ ఉండాలి. గత అయిదేళ్లలో స్వయం ఉపాధి అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల్లో (పీఎంఈజీపీఈ, పీఎం స్వనిధి, ముద్ర) ఎలాంటి రుణాలు పొంది ఉండకూడదు. ఒక వేళ రుణం తీసుకున్న వారు దానిని పూర్తిగా తిరిగి చెల్లిస్తే అర్హులు అవుతారు. రేషన్, ఆధార్ కార్డులు, బ్యాంక్ పాస్‌బుక్ తీసుకెళ్లి వివరాలను సమీపంలోని కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ) ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలి. తరవాత పీఎం విశ్వకర్మ సర్టిఫికెట్, గుర్తింపు కార్డు పొందిన దరఖాస్తుదారుడిని విశ్వకర్మగా గుర్తిస్తారు. దీంతో ఈ పథకం కింద అన్ని ప్రయోజనాలు పొందేందుకు అర్హులవుతారు. ఈ పథకంలో కుటుంబంలోని ఒక వ్యక్తి ప్రభుత్వ ఉద్యోగి అయితే అనర్హులు అవుతారు.

రూ. 3 లక్షల రుణం

పీఎం విశ్వకర్మ పథకం కింద ఎంపికైన వారికి మొత్తం రూ.3 లక్షల రుణాన్ని రెండు విడతల్లో బ్యాంకుల ద్వారా అందిస్తారు. మొదటి విడతలో రూ.లక్ష అందజేస్తారు. దీనిని 18 నెలల్లో వాయిదా పద్ధతిలో చెల్లించి పూర్తి చేయాలి. అనంతరం మరో రూ.2 లక్షల రుణాన్ని అందజేస్తారు. దీనిని స్వల్ప వడ్డీతో వాయిదాల పద్ధతిలో చెల్లించాలి. దీనికి ఎంపికైన వారికి నైపుణ్యాల పెంపునకు మూడు విడతల్లో శిక్షణ అందిస్తారు. మొదటి విడతలో శిక్షణను వారం రోజుల పాటు గుర్తించబడిన నైపుణ్య కేంద్రాల్లో ఇస్తారు. తర్వాత అధునాతన శిక్షణను 15 రోజుల పాటు అందిస్తారు. అనంతరం లబ్ధిదారు శిక్షణ పూర్తయిన తర్వాత రోజుకు రూ.500 చొప్పున చెల్లించి రూ.15 వేల విలువ చేసే సామగ్రిని ఉచితంగా అందజేస్తారు.

రెండు రోజుల్లో పరిశీలన పూర్తి

పీఎం విశ్వకర్మ యోజన కింద దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తులను సంబంధిత వెబ్‌సైట్ నుంచి జిల్లాలోని ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు డౌన్‌లోడ్ చేసుకోవాలి. లబ్ధిదారుల ఇంటికి వెళ్లి దరఖాస్తులను పరిశీలించారు. వీటిని మరో రెండు రోజుల్లో పూర్తి చేసి జిల్లా లాగిన్‌కు పంపించాలి.


- వీర బుచ్చయ్య, జిల్లా పంచాయతీ అధికారి

# చివరి నెలలో 8 మిలియన్ టన్నులు

గోదావరిఖని: సింగరేణి వార్షిక లక్ష్యాన్ని చేరుకోవడానికి మరో నెల రోజుల సమయమే ఉంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా నిర్దేశించుకున్న సింగరేణి ఫిబ్రవరి ముగిసే నాటికి 62.72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించింది. మార్చి నెలలో ఇంకా 8.28 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధిస్తే వార్షిక లక్ష్యాన్ని అధిగమించనుంది. వార్షిక సంవత్సరం మొదటి నుంచి ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించేందుకు చర్యలు తీసుకుంటున్నప్పటికీ కొన్ని అవాంతరాలు రావడంతో ఉత్పత్తి పుంజుకోలేకపోయింది. ఈ ఏడాది భారీ వర్షాల కారణంగా ఉత్పత్తికి ఆటంకం ఏర్పడింది. సాధారణ, సింగరేణి ఎన్నికలు సైతం కొంత బొగ్గు ఉత్పత్తిపై ప్రభావం చూపాయి. దీంతో కొన్ని నెలల్లో నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోలేకపోయింది. మార్చి చివరి మాసంలో 8.28 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధిస్తేనే వార్షిక లక్ష్యం చేరుకునే అవకాశం ఉంది.

రోజుకు 3 లక్షలు..ఈ ఏడాది నిర్దేశించిన వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోవాలంటే రోజుకు 3 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాల్సి ఉంది. సింగరేణి వ్యాప్తంగా 19 ఉపరితల గనులు, 23 భూగర్భ బొగ్గు గనుల ద్వారా ప్రస్తుతం రోజుకు 2.5 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి మాత్రమే సాధిస్తోంది. కొన్ని సందర్భాలలో 2.25 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేపడుతోంది. కానీ 70 మిలియన్ టన్నులకు చేరుకోవాలంటే మార్చి నెలలో రోజుకు 3 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాల్సి ఉంటుంది. దీని కోసం సింగరేణి ఉన్నతాధికారులు ప్రాంతాల వారీగా సమీక్షిస్తున్నారు.

అయిదు డివిజన్‌లలో శత శాతం




సింగరేణిలోని అయిదు డివిజన్‌లు మాత్రం ఇప్పటి వరకు వంద శాతం బొగ్గు ఉత్పత్తి పూర్తి చేశాయి. ఆయా డివిజన్‌లకు ఫిబ్రవరి వరకు కేటాయించిన నిర్దేశిత లక్ష్యాలను శతశాతం చేరుకున్నాయి. మార్చి నెలకు సంబంధించి నిర్దేశించిన లక్ష్యాన్ని కూడా అధిగమించేందుకు ఆయా డివిజన్‌ల అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి వరకు నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాన్ని కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు, బెల్లంపల్లి, ఆర్జీ-3 డివిజన్‌లు చేరుకున్నాయి. మార్చి నెలకు సంబంధించిన ఉత్పత్తిని అధిగమించే అవకాశం ఉంది. అయితే మందమర్రి, శ్రీరాంపూర్, భూపాలపల్లి, అడ్రియాల ప్రాజెక్టులు వార్షిక లక్ష్యానికి దూరంగా ఉన్నాయి. నాలుగు డివిజన్‌లు మార్చి నెలలో కొంత వరకు పుంజుకుంటే సింగరేణి వార్షిక లక్ష్యానికి చేరుకునే అవకాశం ఉంటుంది.

# అభయహస్తం ఎవరికో..?

నల్గొండ: నల్గొండ, భువనగిరి లోక్‌సభ స్థానాల్లో అధికార పార్టీ నుంచి రానున్న ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎంపిక కసరత్తు చివరి దశకు చేరింది. ఒక్కో స్థానానికి మూడు పేర్ల చొప్పున ఇప్పటికే జాబితా తయారు చేసి ఏఐసీసీకి పంపగా..దీనిపై శుక్రవారం రాత్రి కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ సమావేశంలో చర్చించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. రెండు సిట్టింగ్ స్థానాల్లోనూ విజయం సాధించేలా కార్యకర్తలను కార్యోన్ముఖులను చేయాలని హైకమాండ్ పెద్దలు నేతలను ఆదేశించినట్లు సమాచారం. సంస్థాగతంగా బలంగా ఉండటం, రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రస్తుత సమయంలో ఈ రెండు స్థానాల్లోనూ అభ్యర్థులను ప్రకటిస్తే వారి విజయం లాంఛనమేనన్న అభిప్రాయం పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది. రెండు స్థానాల నుంచి పోటీ చేయడానికి పలువురు ఆశావహులు పలు మార్గాల ద్వారా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. నల్గొండ పార్లమెంటుకు మంత్రి ఉత్తమ్ ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తుండగా.. భువనగిరి పార్లమెంటు స్థానం వ్యవహారాలను మంత్రి కోమటిరెడ్డి పర్యవేక్షిస్తున్నారు.

నల్గొండలో... పోటాపోటీ

నల్గొండ స్థానంలో పోటీ చేయడానికి సీనియర్ నేత జానారెడ్డితో పాటూ ఆయన తనయుడు రఘువీర్‌రెడ్డి, సూర్యాపేటకు చెందిన పటేల్ రమేశ్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి కూతురు శ్రీనిధిరెడ్డి, నల్గొండ డీసీసీ



అధ్యక్షుడు శంకర్‌నాయక్ తదితరులు ఆసక్తి చూపుతున్నారు. పార్లమెంటు స్థానాన్ని ఆశిస్తున్న పలువురితో ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడినట్లు..వారికి భవిష్యత్తులో కార్పొరేషన్, ఎమ్మెల్సీలుగా అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఇక్కడి నుంచి జానారెడ్డి లేదంటే ఆయన తనయుడు రఘువీర్‌రెడ్డి పోటీ చేయడం ఖాయమన్న అభిప్రాయం పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది. భువనగిరిపై ఉత్కంఠ..భాజపా, భారాస ఈ స్థానాన్ని బీసీలకు కేటాయిస్తారనే ప్రచారం నేపథ్యంలో అధికార పార్టీ ఇక్కడి నుంచి బీసీ నేతను బరిలోకి దింపాలనే ఆలోచన చేస్తున్నట్లు పార్టీ ఉన్నతస్థాయి వర్గాలు వెల్లడించాయి. ఇక్కడి నుంచి పోటీకి పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, సూర్యాపేటకు చెందిన మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి కొడుకు సర్వోత్తమ్‌రెడ్డి, జిల్లా డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నతో పాటూ పలువురు పార్టీ నేతలు దరఖాస్తు చేసుకున్నారు. తుది జాబితాలో ఉన్న రెండు పేర్లపై రాష్ట్ర సీనియర్ నేత ఒకరు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. దీనిపై ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి వద్దా చర్చ జరిగినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఈ స్థానం పరిధిలో అత్యధిక ఓట్లున్న సామాజికవర్గానికి చెందిన అభ్యర్థులను ప్రతిపక్షాలు బరిలో నిలిపితే పార్టీ ఓసీ అభ్యర్థినే బరిలోకి దించేందుకు మొగ్గు చూపే అవకాశం ఉందని పార్లమెంటు పరిధిలోని ఓ ఎమ్మెల్యేకు వెల్లడించారు.

# 'భారత్' భాగ్యమెప్పుడో..?

మిర్యాలగూడ : దేశ వ్యాప్తంగా రోజురోజుకు పెరిగిపోతున్న బియ్యం ధరలను అదుపులోకి తీసుకు వచ్చేందుకు ఈ ఏడాది ఫిబ్రవరి 6న కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన 'భారత్ రైస్' ఇప్పటి వరకు తెలంగాణకు చేరుకోలేదు కేంద్ర ప్రభుత్వం బాస్మతి బియ్యం మినహా ఇతర బియ్యాన్ని విదేశాలకు ఎగుమతిని నిషేధించింది. అయినప్పటికీ సన్నబియ్యం ధరలు అదుపులోకి రాకపోగా.. గతేడాది కంటే 16 శాతం ధరలు పెరిగిపోయాయి. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో సన్నబియ్యం కిలో రూ.65కు చేరుకుంది. దీనిని అదుపు చేయడానికి ప్రభుత్వం రాయితీ ఇచ్చి సన్నబియ్యాన్ని కిలో రూ.29కే విక్రయించేందుకు 'భారత్ రైస్' ప్రారంభించింది. దేశవ్యాప్తంగా ఈ ప్రక్రియ ప్రారంభమవుతుందని, 5, 10 కిలోల బస్తాల్లో విక్రయాలు చేస్తారని కేంద్ర మంత్రి పియూష్‌గోయల్ ప్రకటించినప్పటికీ తెలంగాణకు ఇప్పటి వరకు బియ్యం చేరలేదు. భారత్ బియ్యం అమ్మకాలను 'జాతీయ వ్యవసాయ సహకార మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా', 'కేంద్రీయ బండార్', 'జాతీయ వినియోగదారుల కో- ఆపరేటివ్ ఫెడరేషన్' అనే మూడు సంస్థల ద్వారా జరిపించేందుకు నిర్ణయించారు. కేంద్రం తెలంగాణకు 2 వేల టన్నులు బియ్యం కేటాయించినప్పటికీ భారత ఆహార సంస్థ నుంచి సరఫరా చేయాల్సి ఉంది. ఈ కేటాయింపులు సైతం కేవలం హైదరాబాద్‌కు కూడా సరిపోని పరిస్థితి నెలకొంది. రాష్ట్రాల పౌరసరఫరాల శాఖ అధికారులకు దీనిపై ఎలాంటి పర్యవేక్షణ కల్పించలేదు.గతేడాది నవంబరులో 'భారత్ ఆటా' (గోధుమపిండి)




కిలో రూ.27.50కే ప్రారంభించగా.. దీనికి 800 మొబైల్ వ్యాన్లు, 2 వేల దుకాణాల్లో విక్రయించే ఏర్పాటు చేసింది. ప్రస్తుతం భారత్ దాల్ పేరుతో పప్పు కిలో పాకెట్ రూ.60కే విక్రయాలు ప్రారంభించగా.. చాలా చోట్ల అందుబాటులోకి వచ్చింది. ప్రభుత్వం మరోవైపున ఆన్‌లైన్ మార్కెట్‌లో సైతం విక్రయాలు జరుపుతారని ప్రకటించగా అంతా ఆన్‌లైన్‌లో సైతం బియ్యం కోసం ప్రయత్నిస్తున్నారు.

పౌరసరఫరాల శాఖ పర్యవేక్షణ లేదు..

- వెంకటేశ్వర్లు, జిల్లా పౌరసరఫరాల అధికారి, నల్గొండ

'భారత్ బియ్యం' నాఫెడ్, కేంద్రీయ బండార్, ఎన్‌సీసీఎఫ్‌లకు మాత్రమే విక్రయించేందుకు కేంద్రం అనుమతించింది. వారి ద్వారానే జిల్లాలోని అన్ని ప్రాంతాలకు బియ్యం సరఫరా చేసి విక్రయిస్తారు. పౌరసరఫరాల శాఖకు ఎలాంటి పర్యవేక్షణ లేదు.

# రేవంత్ మొగోడు.. ఎంత మంది ఒక్కటైనా ఏం చేయలేరు




హైదరాబాద్: బీఆర్ఎస్ నేతలు మా మధ్య పుల్లలు పెడుతున్నారని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పేర్కొన్నారు. నేడు ఆయన గాంధీభవన్‌లో మాట్లాడుతూ.. ఆడ బిడ్డలందరికీ ప్రతీక సీతక్క అన్నారు. సీతక్క అత్యంత ప్రతిష్మాత్మకమైన పోర్ట్ ఫోలియో నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. మాజీ సీఎం కేసీఆర్ కమీషన్లలో కేంద్రానికి వాటా ఉందన్నారు. తెలంగాణ ఆత్మ గౌరవానికి బ్రాండ్ అంబాసిడర్ మా రేవంత్ అని జీవన్ రెడ్డి పేర్కొన్నారు. ఎవరెవరు ఒక్కటైనా రేవంత్‌ని ఏం చేయలేరని జీవన్ రెడ్డి అన్నారు. కేసీఆర్ అవినీతిని ప్రోత్సహించిందే బీజేపీ అని పేర్కొన్నారు. అనుమతుల్లేని ప్రాజెక్టులకు కేంద్రం అప్పు ఇచ్చిందంటే అర్థం చేసుకోవచ్చన్నారు. అయ్యాకొడుకులు మోదీ ముందు మోకరిల్లారన్నారు. రేవంత్ మొగోడు అని పేర్కొన్నారు. కృష్ణా జలాలను కేసీఆర్ తన మిత్రుడు జగన్‌కి తాకట్టు పెట్టాడన్నారు. నోటిఫికేషన్లు ఇచ్చింది.. దానికి ఆటంకాలు తెచ్చింది కేసీఆరేనని పేర్కొన్నారు. తెలంగాణ ఆత్మ గౌరవాన్ని తాకట్టు పెట్టింది కేసీఆరేనన్నారు. తెలంగాణకి ఏం కావాలని ప్రధాని అడిగితే... మాకేం వద్దని కేసీఆర్ అన్నారని జీవన్ రెడ్డి పేర్కొన్నారు. తన కొడుకును ముఖ్యమంత్రిని చేయడానికి సహకరించమని కోరినప్పుడు ఆత్మ గౌరవం ఏమయిందని తెలిపారు. కేసీఆర్ అవినీతిని కప్పి పుచ్చుకునేందుకు మోదీతో కేసీఆర్ సఖ్యతగా ఉన్నారన్నారు. విభజన చట్టంలోని హామీలను కేసీఆర్ తేవడంలో విఫలం అయ్యారని జీవన్ రెడ్డి పేర్కొన్నారు. కమీషన్ల కోసం కక్కుర్తి పడేవాళ్లు కూడా ఆత్మ గౌరవం గురించి మాట్లాడుతున్నారన్నారు. ఉత్తర తెలంగాణ ప్రజల చిరకాల కలను రేవంత్ తీరుస్తున్నారన్నారు. వైట్ రేషన్ కార్డు ఉండి, 200 యూనిట్లకు మించినా ఉచిత కరెంట్ ఇస్తామని జీవన్ రెడ్డి పేర్కొన్నారు.

# నన్ను విమర్శిస్తే ఆకాశంలో ఉమ్మినట్టే.. రేవంత్‌పై డీకే అరుణ ఫైర్



మహబూబ్‌నగర్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీజేపీ నేత డీకే అరుణ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సీఎం రేవంత్ అధికారంలో ఉన్నా ప్రతిపక్ష నాయకుడిలానే మాట్లాడారని... వాళ్లపై వాళ్లకే నమ్మకం లేదని వ్యాఖ్యలు చేశారు. ఏక్ నాథ్ షిండేలా ఎవరైనా వస్తే బీజేపీ ఆలోచిస్తుందన్నారు. "ప్రధానమంత్రిని మొన్న పెద్దన్న అన్నావ్. మీ పార్టీలో విమర్శలు వస్తే.. ఇప్పుడు మోడీ కేడి అంటున్నావ్. నిన్నే ఏక్ నాత్ షిండే అని మీ పార్టీ వారు అంటున్నారు. పాలమూరు అభివృద్ధికి రేవంత్ చేసిందేమిటి.. నేను మంత్రిగా పాలమూరుకు ఎంతో చేశాను.. నన్ను విమర్శిస్తే ఆకాశంలో ఉమ్మినట్టే" అంటూ కామెంట్స్ చేశారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కోసం కేంద్రం 60 శాతం నిధులు ఇస్తామని చెబుతున్నా.. జాతీయ హోదా కోసం ఎందుకు పట్టు పడుతున్నారని మండిపడ్డారు. 2014లో ఉన్న పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం డిజైన్ ఇప్పుడు ఉందా అని ప్రశ్నించారు. కాళేశ్వరంపై జ్యుడీషియరీ ఎంక్వయిరీ పేరుతో కాలయాపన చేస్తూ ఆ కాంట్రాక్టర్‌ను రక్షించేందుకు ఇప్పటి ప్రభుత్వం కూడా ప్రయత్నిస్తుందని... చిత్తశుద్ధి ఉంటే సీబీఐతో ఎంక్వయిరీ చేయించాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ అహంకారంతో మాట్లాడుతున్నారని.. కేసీఆర్ ఇదే అహంకారం చూపితే ప్రజలు ఫామ్ హౌస్‌కు పంపించారని డీకే అరుణ పేర్కొన్నారు.

# సీఎం రేవంత్ వ్యాఖ్యలకు హరీష్‌రావు స్ట్రాంగ్ కౌంటర్



సంగారెడ్డి, మార్చి 7: సీఎం రేవంత్ రెడ్డి పాలమూరు వేదికగా చేసిన వ్యాఖ్యలను మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు తీవ్రంగా ఖండించారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. మహబూబ్‌నగర్ వెనుకబాటు తనానికి కారణం నాటి టీడీపీ, కాంగ్రెస్ పాలన అని అన్నారు. రేవంత్ తిట్టాల్సి వస్తే తన గురువు చంద్రబాబును తిట్టాలని.. కాంగ్రెస్ పార్టీ చేసిన మోసాలను నిందించాలన్నారు. చంద్రబాబు పాపాలు, కాంగ్రెస్ పార్టీ లోపాలు, పాలమూరు పాలిట శాపాలుగా మారాయని.. పాలమూరు వలసలకు కారణం ఆ రెండు పార్టీలే అని విమర్శించారు. గత పార్టీలు ప్రాజెక్టుల పేర్లు మార్చారు తప్ప పనులు పూర్తి చేయలేదన్నారు. తాము పెండింగ్ ప్రాజెక్టును రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చామని.. అలాంటి కేసీఆర్‌ను తిట్టడం అవివేకం తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. "పేగులు మెడలో వేసుకొని రాక్షసులు తిరుగుతరు. ముఖ్యమంత్రి మాట్లాడే భాషనా పడిగట్టు పదాలు, పరుష పదజాలంతో పరిపాలన సాగదు. ప్రతిపక్షంలో ఉన్నట్లు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం సరికాదు. మంచిపేరు తెచ్చుకోవాలంటే వల్గారిటీ కాదు.. చిల్లర మల్లర భాష మాట్లాడి పదవి గౌరవం తగ్గించుకోవద్దు. తన ఎత్తు గురించి ఆయన మాట్లాడుతరు. నేను అలా మాట్లాడి విలువ తగ్గించుకోను. కుసంస్కారంగా మాట్లాడటం వల్ల విలువ దిగజారుతుంది. ఎంత ఎత్తు ఉన్నమన్నది కాదు, ప్రజల కోసం ఎంత గట్టిగా పని చేసినం అన్నది ముఖ్యం. మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందే ప్రయత్నం చేస్తున్నడు. పాలమూరు వలసలు వాపస్ చేసింది కేసీఆర్. తన తండ్రి చనిపోతే స్నానం చేసేందుకు నీళ్లు లేక నెత్తి మీద నీళ్లు చల్లుకొని వెళ్లినా అని స్వయంగా రేవంత్ రెడ్డి చెప్పారు. ఆ సమయంలో అధికారంలో ఉన్నది కాంగ్రెస్ కాదా. పాలమూరు ప్రాజెక్టులను కాగితాలకు పరిమితం చేసింది కాంగ్రెస్ కాదా? పాలమూరు కరువుతో రాజకీయాలు చేసింది కాంగ్రెస్, టీడీపీ" అంటూ విరుచుకుపడ్డారు.

# లిక్కర్ కేసు...పెద్ద కేసు కాదు: ఎమ్మెల్సీ కవిత




హైదరాబాద్: సీతక్కకు డిప్యూటీ సీఎం పదవి ఇస్తామని హామీ ఇచ్చారని, మహిళ అయిన ఆమెకు డిప్యూటీ సీఎం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నానని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అన్నారు. ఈ సందర్భంగా గురువారం ఆమె హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ.. అనుభవరాహిత్యం, అవగాహన లోపంతో సీఎం రేవంత్ పాలన ఉందని, అలాంటి ముఖ్యమంత్రి ఉండడం మన ఖర్మ అని అన్నారు. లిక్కర్ కేసు... పెద్ద కేసు కాదని ఆమె అభిప్రాయం వ్యక్తం చేశారు. "కేసును టీవీ సీరియల్ కేసు లెక్క లాగుతున్నారు.. నాకు కూడా పెద్ద ఇంటరెస్ట్ లేదు.. మా లీగల్ టీం దాన్ని చూసుకుంటుంది.. నేను బాధితురాలిని... ఫైట్ చేస్తా" అని అన్నారు. ఆదర్శ్ కుంభకోణం ఏమైందని ఎమ్మెల్సీ కవిత ప్రశ్నించారు.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జ్‌లు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్‌లు, డివిజన్ ఇంచార్జ్‌లతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్

9440977660, 9110718194




# మల్లారెడ్డి అల్లుడు రాజశేఖర్ రెడ్డికి అధికారుల షాక్

హైదరాబాద్: మాజీ మంత్రి మల్లారెడ్డి అల్లుడు మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి అధికారులు షాక్ ఇచ్చారు.

రాజశేఖర్ రెడ్డికి చెందిన అక్రమ కట్టడాలను నేడు అధికారులు కూల్చివేశారు. దుండిగల్‌లోని చిన్న దామర చెరువుపై కట్టిన ఏరోనాటికల్ ఇంజనీరింగ్ కాలేజ్‌లోని అక్రమ కట్టడాలన్నింటినీ అధికారులు కూల్చేశారు. రాజశేఖర్ రెడ్డి చెరువును ఆక్రమించి కాలేజ్‌లో కొన్ని నిర్మాణాలు చేశారని పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందడంతో అధికారులు చర్యలు తీసుకున్నారు. మేడ్చల్ కలెక్టర్ ఆదేశాలతో దుండిగల్, గండి మైసమ్మ మండల రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు ఆధ్వర్యంలో కూల్చివేతలు జరిగాయి.

# ఎమ్మెల్సీల నియామకాలపై ప్రభుత్వానికి ఎదురుదెబ్బ..

## కోదండరాం, అలీఖాన్ నియామకం చెల్లదన్న హైకోర్టు



హైదరాబాద్: గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకాలపై ప్రభుత్వానికి చుక్కెదురైంది. ఎమ్మెల్సీలుగా కోదండరాం, అమీర్ అలీఖాన్ నియామకం చెల్లదని హైకోర్టు స్పష్టం చేసింది. ఇద్దరిని ఎమ్మెల్సీలుగా నియమిస్తూ ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్‌ను కొట్టివేసింది. దాసోజు శ్రవణ్, కూర సత్యనారాయణల ఎన్నికను గవర్నర్ పునర్‌పరిశీలించాలని ఆదేశించింది. మంత్రి మండలి నిర్ణయానికి గవర్నర్ కట్టుబడి ఉండాల్సిందేనని సూచించింది. మళ్లీ కొత్తగా ఎమ్మెల్సీ నియామకాలు చేపట్టాలని స్పష్టం చేసింది. దాసోజు శ్రవణ్, సత్యనారాయణ నియామకాన్ని కొట్టివేసే అధికారం గవర్నర్ లేదని పేర్కొంది. కేబినెట్‌కు తిప్పిపంపాలి తప్ప తిరస్కరించకూడదని వెల్లడించింది. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తీర్పు వెలువరించింది.

# లోటు వర్షపాతమా?.. సీఎం మాటలు విడ్డూరమంటూ కేటీఆర్ ట్వీట్



హైదరాబాద్, మార్చి 7: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విరుచుకుపడ్డారు. నిన్న(బుధవారం) రాష్ట్ర వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో శ్రీకారం చుట్టిన 'రైతునేస్తం' వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో ఏడాదిగా సరైన వర్షపాతం లేకపోవడంతో రిజర్వాయర్లలో నీళ్లు అడుగంటుతున్నాయని, అందుకే అన్ని ప్రాంతాల్లో నీటి సమస్య తీవ్రంగా ఉందని సీఎం అన్నారు. ఈ వ్యాఖ్యలను కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ట్విట్టర్ వేదికగా సీఎంను విమర్శిస్తూ మాజీ మంత్రి వ్యాఖ్యలు చేశారు.

**కేటీఆర్ ట్వీట్ ఇదే..** "ఐఎండీ లెక్కల ప్రకారం 2023-24 సంవత్సరానికి సాదరానికంటే 14శాతం ఎక్కువ వర్షపాతం(ఎక్సెస్ రెయిన్ ఫాల్) తెలంగాణలో అయ్యింది. నీటి సమస్యలను తీర్చి చావలేక, చాత కాక...లోటు వర్షపాతం అని సీఎం మాట్లాడటం విడ్డూరం. అబద్ధాలు, అలవికాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు సత్యం దూరం మాటలు అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవర్తించడంతో తెలంగాణ ప్రజలు అసహ్యించుకుంటున్నారు. రైతు సమస్యలు తీరుస్తా అని అనడం అటుంచి... రైతు ఏం అర్థం చేసుకోవాలి మీ చేతగానితనాన్ని?" అంటూ ట్వీట్ చేశారు.

# తెలంగాణలో బీజేపీకి మంచి వాతావరణం ఉంది.. 17 స్థానాలు టార్గెట్




హైదరాబాద్: బీజేపీ కార్యాలయంలో రాష్ట్ర ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. పెండింగ్ స్థానాలకు అభ్యర్థుల ఎంపికపై చర్చ నిర్వహిస్తున్నారు. ఈనెల 12న అమిత్ షా పర్యటనపై సైతం సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల కోసం పార్టీ యంత్రాంగం సిద్ధం కావాలన్నారు. తెలంగాణలో బీజేపీకి మంచి వాతావరణం ఉందన్నారు. అనుకూల వాతావరణాన్ని బీజేపీకి మరింత సానుకూలంగా మార్చుకోవాలని కిషన్ రెడ్డి తెలిపారు. ప్రధాని మోదీ అదిలాబాద్, సంగారెడ్డి సభలు విజయవంతం అయ్యాయన్నారు. పార్టీ బలహీనంగా ఉన్న ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో కూడా విజయ సంకల్పయాత్ర విజయవంతమైందన్నారు. పార్టీ జెండా మీదనే యాత్ర నిర్వహించామని తెలిపారు. బీజేపీపై కాంగ్రెస్, బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తున్నాయన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పి కొట్టాలన్నారు. బీజేపీను దెబ్బ తీయాలని కుట్ర చేస్తున్నారని.. 17స్థానాల్లో విజయం సాధించే విధంగా ఎన్నికల నిర్వహణ ఉండాలని కిషన్ రెడ్డి కోరారు.

# సీఎం రేవంత్ అసమర్థతతో రాష్ట్రంలో కృత్రిమ కరువు: ఎమ్మెల్సీ కవిత



హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసమర్థతతో రాష్ట్రంలో కృత్రిమ కరువు వచ్చిందని ఎమ్మెల్సీ కవిత మండిపడ్డారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఇబ్బంది పెట్టేందుకే కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీళ్లను ఎత్తిపోయలేదని విమర్శించారు. సీఎం రేవంత్ డీఎన్ఏ లోనే మోదీతో స్నేహం ఉందని చెప్పారు. ఆయన బీజేపీలో చేరే అవకాశం ఉందన్నారు. గురుకులాలు, హాస్టళ్లలో విద్యార్థులు చనిపోతుంటే ముఖ్యమంత్రి పట్టించుకోవట్లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. సీఎం రేవంత్ భాష ఎలా ఉంది.. ఆయనపై కేసులు పెట్టాలన్నారు. మహిళల పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ఉద్యోగాల్లో మహిళా రిజర్వేషన్లపై న్యాయపోరాటం చేస్తామని చెప్పారు. శుక్రవారం హైదరాబాద్ ధర్నా చౌక్ వద్ద దీక్ష చేస్తామని ప్రకటించారు. బీఆర్ఎస్‌ను బొంద పెట్టాలని రెండు జాతీయ పార్టీలూ చూస్తున్నాయని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలవకపోతే ప్రజలకే నష్టమన్నారు.

# ఎన్నికలప్పుడు పార్టీలు మారడం సహజమే..



హనుమకొండ : బీఆర్ఎస్‌ను బూచీగా చూపించి మంత్రులను సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరిస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ప్రభుత్వాన్ని టచ్ చేసి చూడమని హెచ్చరించారు. మాకు ప్రభుత్వాన్ని కూలగొట్టాలన్న ఆలోచన లేదన్నారు. ఇచ్చిన హామీలపై దృష్టి పెట్టాలని కడియం శ్రీహరి సూచించారు. వచ్చే వేసవిలో తాగునీటి సమస్య, కరెంటు సమస్య తీవ్రంగా ఉండే అవకాశం ఉందని.. దానిపై దృష్టి పెట్టాలని సూచించారు. అధికార పార్టీ కేసులకు భయపడి కొందరు తొందరపడి పార్టీ మారుతున్నారన్నారు. ఎన్నికలప్పుడు పార్టీలు మారడం సహజమేనన్నారు. కడియం శ్రీహరి ఎవరి గురించి టికెట్ అడగరని.. అందరితో తనను జత కట్టవద్దన్నారు. బీఆర్ఎస్ పార్టీ తిరిగి పుంజుకుంటుందని కడియం శ్రీహరి ఆశాభావం వ్యక్తం చేశారు.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660